# ★ వరవిక్రయ దస్తావేజు ★

మరువాడ సూర్యప్రకాశం

రూ॥ 116-లకు వరవిక్రయదస్తావేజు. 1 విరోధినామ సం॥ జ్యేష్ఠ బ- అమావాస్య వ్రాయించుకున్నవారు -

విశాఖపట్నం జిల్లా శ్రీకాకుళం తా॥ ఆడబిడ్డల వలస గ్రామం కాపురస్థులు బ్రాహ్మణులు శ్రీ కన్యాదానాల కనకయ్యగారి చతుర్థ పుత్రిక క్రిష్ణవేణమ్మ డు

వ్రాసియిచ్చినవాడు -

తూర్పుగోదావరిజిల్లా, కాకినాడ తా॥ పురుషలింగాపుర గ్రామం కా॥ బ్రాహ్మణులు ఇనాందారులు (ఒకానొకప్పుడు బిరుదుటనం) పుత్రసంతానాల పుల్లయ్యగారి తృతీయకళత్రపుత్రుడు దురాశాగారు వ్రాయించియిచ్చిన వరవిక్రయ దస్తావేజు

2. మా కుటుంబ పోషణార్థమున్నూ బ్లాకు మార్కెట్టులో వస్తువులు యెక్కువ ధరలకు కొన్నప్పుడు చేసిన చిల్లరఋణములు విమోచనార్థమున్నూ యీ దిగువ 3వ పేరాలో వుదహరించిన నా పుత్రుని యీరోజున నీకు రూ॥ 116 లకు విక్రయించి క్రయధనం నీ వివాహముహూర్తపు సందర్భములో వధూవరుల నాశీర్వదించుటకై విచ్చేసిన గౌరవనీయులగు తగు మనుష్యుల సమక్షమందు నీ తండ్రిగారగు శ్రీ కన్యాదానాల కనకయ్యగారి పరంగా (నా పుత్రుడు నీకు పుస్తెముడి కట్టేవేళ) నగదు (కరెన్సీనోట్లు కవరు) చెల్లించినమూలంగా ముట్టినది గనుక నా పుత్రుని యందు నాకుగల ప్రేమ, దయ, దాక్షిణ్యము వగైరాలన్నియూ విడచుకొని యీ వెంటనే నీ స్వాధీనము చేయుడమైనది. గనుక యింతటినుండి నీవు తిట్లు, దీవనలు, చీవాట్లు, బుగ్గపోట్లు వగైరా సమస్త అధికారములతో నీ యిష్టానుసారం నా పుత్రుని శరీరం బడుగుచెందువరకు అనుభవిస్తూ యుండవలెను. యీ క్రియము అమలుజరిగేవేళలో (అనగా గర్భాదాన సమయమందు) నీకు యెట్టి అంతరాయమువచ్చినా ముక్కాని కార్డు వ్రాస్తే నేనే స్వయముగావచ్చి మీ తగవును పరిష్కరించి నా పుత్రుని తిరిగి నీ వశంచేయుటకు నేను భాధ్యుడను. ఈ నా పుత్రుని యిదివరకు యితరత్రా పరాయి స్త్రీలకు, వారకాంతలకు యెట్టి అన్యాక్రాంతము చేయలేదని నిన్ను నమ్మించి యీ క్రియము చేయడమైనది. వచ్చే ఫసలీనుండి నీవు నా పుత్రునకు కూడుగుడ్డలను యిచ్చుచుంటూ నీయిచ్చవచ్చినట్లు అతనిచే చాకిరీ చేయించుకోవచ్చును నా పుత్రుని మహిమచే నీ కడుపు ఫలించిన యెడల నా పుత్రుని మరణాంతము నీవు నీ సంతతివారిచేత పూటా అతనికి తద్దినములు పెట్టిస్తూయుండవలయును.

3 క్రయంచేసిన వరుని వివరము-

తూ॥ గోదావరిజిల్లా, కాకినాడతా॥ పురుషలింగాపురగ్రామ వాస్తవ్యుడును, శ్రీ దురాశారావుగారి కొమరుండును, ముమ్మారు ఎస్. ఎస్. ఎల్. సి. పరీక్ష తప్పిన మహా మేధావియు, అస్వతంత్రరావు అనే పేరుగల 25 సం॥రములు ప్రాయముగల ముదిరిన నూగుమీసము ఫ్రెంచి కటింగు రూపమై యొప్పారు మీసరిగల మొగవాడును. యీ దిగువ నుదహరించిన బంధువర్గము (మధ్యను సంచరించు వరుని నీకీ దినమున విక్రయించడమైనది.

## బంధువుల వివరము:—

1. పితృవంశమునకు- జగడాలమ్మ అనె మేనత్త ఆమె కూతురు కామాక్షమ్మ.
2. మాతృవంశమునకు- పినతల్లి కూతురు చెండికమ్మ
3. స్నేహబాంధవ్యము- దురలవాట్ల దుర్జనశాస్త్రి.
4. పాత పరిచయబాంధవ్యము- మిస్ వెంకటమ్మ అనే యావ్వ దాసి.

నోటు- వరునివయస్సు నిదర్శనార్థము యిందుతో నీకు అతని జాతకము సమర్పించుకోవడమైనది.

పుత్రసంతానాల దురాశారావు.

ఇందుక్కు సాక్షులు

1. వివాహాల విశేశంవ్రాలు.
2. వరకట్నాల వర్ధనశాస్త్రివ్రాలు.

దస్తూరీ ఇల్లరికపు ఈశ్వరప్పవ్రా: